ప్రజాశక్తి
బుధవారం 30 అక్టోబర్ 2024 5
శ్రీ సత్యసాయి

జిల్లా అభివృద్ధికి కార్యాచరణ

కలెక్టర్ టిఎస్.చేతన్

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

స్వర్ణాంధ్ర 2047 విజన్ కింద రానున్న ఐదేళ్లలో వివిధ రంగాల్లో జిల్లా 15 శాతం మించి స్థూల ఉత్పాదన సాధన లక్ష్యాంగా జిల్లా విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేయడానికి కార్యచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. గోరంట్ల మండలం కమ్మలవాండ్లపల్లి వద్ద ఉన్న బెస్ట్ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ కింద కార్యక్రమాల్లో విద్యార్థుల పాత్రపై అన్న అంశంపై మంగళవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందులో ఒక విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేయడంలో డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ స్థిరమైన సమగ్ర అభివద్ధిని సష్టించే దక్పథంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఇందులో విద్యార్థులను కలుపుకుని వారి మేధస్సును ఉపయోగించుకోనున్నట్లు చెప్పారు. జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవనం, పారిశ్రామిక పర్యాటకం రంగాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతం బెంగళూరుకు సమీపంలో ఉండటం మరో మేలు చేసే అంశం అన్నారు. విద్యార్థులు జిల్లా అభివృద్ధిని కాంక్షిస్తూ నిర్దిష్టమైన అంశాలపై ప్రాజెక్ట్‌ల ద్వారా పరిశోధనలు ఇవ్వాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పరిశోధన ఫలితాలు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఛైర్మన్ భరత్ లాల్ మీనా, డాక్టర్ రూప వాసుదేవన్, తహశీల్దార్ మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ గందరగోళం..!

సూపర్ -6 హామీల అమల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేలా ప్రకటన చేసింది. ఇందులో భాగంగా దీపావళి కానుకగా మంగళవారం నుంచి సిలిండర్ బుక్ చేసుకున్న వారికి మొదటి సిలిండర్ ఇవ్వనున్నారు. అయితే ఈ సిలిండర్లు అందరికీ ఇస్తారా... లేక కొందరికే ఇస్తారా..? అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం మాత్రం అర్హులందరికీ ఇస్తామంటూ ప్రకటన చేస్తోంది. కమర్షియల్, దీపం, ఉజ్వల ఇలా వివిధ కేటగిరిల్లో లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్లను తీసుకున్నారు. మరి వీరందరికీ ఇస్తారా లేక దీపం లబ్ధిదారులకు మాత్రమే ఇస్తారా..? అన్నదానిపై స్పష్టత కరువవడంతో ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.

- ఉచితం అందరికా.. కొందరికా..?!
- స్పష్టతనివ్వని ప్రభుత్వం
- అర్హులందరికీ అంటూ ప్రకటనలు
- ఎవరు అర్హుల్లో తెలియని పరిస్థితి
- 'దీపం' పేరుతో అర్హులంటూ ప్రభుత్వం నుంచి సెల్‌కు సందేశాలు
- ఈకేవైసీకీ అవస్థలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందేందుకు ఈ నెల 29వ తేదీ(మంగళవారం) నుంచి బుకింగ్ ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా ఇప్పటికే లబ్ధిదారులు సిలిండర్ల కోసం బుకింగ్ ప్రారంభించారు. పాత పద్ధతిలోనే ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుంటున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు మొదటి సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవచ్చు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చూస్తే అనంతపురం జిల్లాలో 5,57,975, శ్రీసత్యసాయి జిల్లాలో 6,67,268 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో రేషన్‌కార్డుల వారీగా చూస్తే 12,54,911 మంది ఉన్నారు. రేషన్‌కార్డు, ఆధార్, ఈకేవైసీ అన్ని పూర్తిగా, సక్రమంగా ఉన్న వారు ఎందరున్నారన్న దానిపై అధికారులు స్పష్టంగా చెప్పడం లేదు.

'దీపం'కు మాత్రమేనా..?

ప్రస్తుతం జనాల్లో ఉచిత గ్యాస్ సిలిండర్‌పై పెద్ద చర్చ నడుస్తోంది. అందరికీ దీనిని వర్తిస్తారా.. లేక కొందరికి మాత్రమే వర్తిస్తారా అనే చర్చ నడుస్తోంది. గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి కమర్షియల్, దీపం, ప్రధానమంత్రి ఉజ్వల తదితర కేటగిరీల్లో లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో రేషన్‌కార్డు ప్రామాణికంగా అందరికీ మూడు సిలిండర్లు ఇస్తారా లేదా అన్న దానిపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వడం లేదు. ప్రభుత్వం అర్హులందరికీ ఇస్తామని చెబుతోంది తప్పా, రేషన్‌కార్డుతో కూడిన గ్యాస్ కనెక్షన్ తీసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచితం ఇస్తామనే మాట ఇప్పటికీ చెప్పడం లేదు. దీంతో చాలా మంది కేవలం దీపం గ్యాస్ కనెక్షన్ ఉన్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుందనే ప్రచారం నడుస్తోంది. ఇందులో కూడా ఎవరు దీపం గ్యాస్ కనెక్షన్ పరిధిలో ఉన్నారన్న విషయం ఆ లబ్ధిదారునికి కూడా తెలియదు. చాలా మంది 20 ఏళ్ల క్రితం దీపం కనెక్షన్లు తీసుకున్నారు. ఆ తరువాత ఆధార్ అనుసంధానం, డబుల్ సిలిండర్, ఇతర మార్పుల పేరుతో కనెక్షన్ల రూపాలు మారాయి. ఇలాంటి వారంతా తమకు ఉచిత సిలిండర్ వస్తుందా.. రాదా..? అన్న సందిగ్ధంలోనే ఉన్నారు.

ఉజ్వల్ కనెక్షన్‌కు ఇవ్వరా..?

ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేశారు. రేషన్‌కార్డు ప్రామాణికంగా గతంలో కనెక్షన్ లేని వారందరికీ ఉజ్వల పథకం కింద కనెక్షన్ ఇచ్చారు. గ్యాస్ స్టవ్‌తో పాటు, ఒక సిలిండర్‌ను ఈ పథకం కింద ఉచితంగా ఇచ్చారు. దీని కింద గ్యాస్ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్కో సిలిండర్‌పై రూ.300 రాయితీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోంది. కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది కాబట్టి ఉజ్వల లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత సిలిండర్ పథకం పరిధిలోకి రారనే ప్రచారం నడుస్తోంది. దీనిపై కూడా ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైంది.



7:10 pm

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దీపావళి నుండి అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల "దీపం-2" పథకంలో నమోదు కాబడినందున శుభాకాంక్షలు. మీ సబ్సిడీ అమౌంట్,మీరు సిలిండర్ డెలివరీ తీసుకున్న 48 గంటలలో మీ బ్యాంకు ఖాతా నందు జమ చేయబడుతుందని తెలియచేస్తున్నాము.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

సిలిండర్ బుక్ చేసిన అనంతరం దీపం-2 ద్వారా ఉచిత సిలిండర్‌కు అర్హులంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సెల్‌ఫోన్‌కు వచ్చిన సందేశం.. అయితే ఇలాంటి సందేశాలు గ్యాస్ బుక్ చేసుకున్న అందరికీ రాలేదు...!

ఈకేవైసికి తిప్పలు

ఉచిత గ్యాస్‌కు అర్హులు కావాలంటే ఈకేవైసి తప్పనిసరి అని ప్రభుత్వం నిబంధన పెట్టింది. గ్యాస్ కనెక్షన్ నెంబర్‌కు ఆధార్ ఈకేవైసీతో అనుసంధానం కావాల్సి ఉంది. దీంతో లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు గ్యాస్ ఏజెన్సీల వద్దకు క్యూ కడుతున్నారు. మంగళవారం నాడు ఆయా గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలోనే ప్రజలు బారులుదీరారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ఉచిత సిలిండర్ రాదన్న భయంతో ప్రజలు అక్కడికి వెళ్తున్నారు. చాలా మంది ఇంకా ఈకేవైసీ చేయించుకోలేదని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగకపోతే మొదటి ఉచిత సిలిండర్‌ను లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం ఉంది.

స్పష్టత ఇవ్వాలి

ఉచిత గ్యాస్ సిలిండర్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. రేషన్‌కార్డు ద్వారా తీసుకున్న అందరికీ ఉచితంగా సిలిండర్ ఇస్తారా.. లేక దీపంకు మాత్రమే ఇస్తారా అన్న దానిపై సందిగ్ధత ఉంది. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పష్టతను ఇవ్వాలి. ఎలాంటి షరతులు లేకుండా తెల్ల రేషన్‌కార్డుతో గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా మూడు సిలిండర్లు ఇవ్వాలి.

అరుణ, గృహిణి, హౌసింగ్‌బోర్డు, అనంతపురం.

ప్రహరీ పనులను పరిశీలించిన మంత్రి

ప్రహరీని పరిశీలిస్తున్న మంత్రి సవితమ్మ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ నూతన్ పాఠశాల ఆవరణంలో కేజీబీవీ టైప్ 4 వసతి గృహానికి నిర్మిస్తున్న ప్రహరీ పనులను మంత్రి సవిత మంగళవారం పరిశీలించారు. నెల రోజులక్రితం ప్రహరీ నిర్మాణానికి రూ. 31 లక్షలు నిధులు మంజూరు చేశారు. పనులను కాంట్రాక్టర్ డీవి ఆంజనేయులు త్వరతగతిన చేయిస్తుండడంతో మంత్రి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. భవనం లోపల కూడా పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అంతకుమునుపు మండలంలోని చాకర్లపల్లి గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్లు పనులను మంత్రి పరిశీలించారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్లో ఇబ్బందిగా ఉన్న డివైడర్ ను మంత్రి పరిశీలించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుండి కొత్తపల్లి క్రాస్ వరకు ఉన్న డివైడర్ తో ప్రజలు పడుతున్న బాధను తెలుసుకొని పరిశీలించారు. ఎక్కువ వెడల్పుతో డివైడర్ ఉండటంతో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు విన్న మంత్రి అతి తొందరలోనే డివైడర్ వెడల్పు తగ్గించి సుందరీకరణ చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దలింగప్ప, హిందూపూర్ పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, డివి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు వడ్డే సురేష్, నాయకులు సంజీవరెడ్డి, సర్పంచు నరసింహులు, మాజీ ఎంపిటీసీలు కిష్టప్ప, ప్రభాకర్, గట్టు మహీంద్ర, డీలర్లు తుమకూంట బాలు, మురళి, రామాంజినేయులు మరి, రమేష్, జనసేన నాయకులు నాగరాజు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారిద్దాం

పాంచజన్య శ్రీనివాసులు

విద్యార్థులతో కలిసి ముందస్తు దీపావళి వేడుకలు చేసుకుంటున్న పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

వాతావరణంలో రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడం కోసం దీపాలతో దీపావళి నిర్వహించు కుందామని పాంచజన్య శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ ఉన్నత పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా దీపాలను వెలిగించి ప్రదర్శించారు. అనంతరం పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు దీపావళిని పురస్కరించుకొని విపరీతంగా టపాసులు పేల్చడం వల్ల వాతావరణం మరింత కాలుష్యం అవుతుందని దీని వల్ల అందరికీ నష్టాదాయకమని అన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి దీపాలతోనే దీపావళిని నిర్వహించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, ఏవో భాస్కర్, హెచ్ఎం గాయత్రి, పాఠశాల సూపరిటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

35 పశువుల షెడ్లు మంజూరు

ప్రజాశక్తి - గాండ్లపెంట

పశువు సంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడి రైతులకు 90 శాతం సబ్సిడీతో 35 పశువులు షెడ్లు మంజూరయ్యాయని ఏపీవో మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు ఉపాధి హామీ పథకం కింద సబ్సిడీతో పశువులు గొర్రెలు కోళ్ల పెంపకాన్ని షెడ్లు మంజూరు చేసిందన్నారు. అర్హులను గుర్తించి వెంటనే నిర్మాణ పనులు చేపడతామని వారు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సిడిపిఒ శాంత లక్ష్మికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి భావమ్మ మాట్లాడుతూ పెనుకొండ,రొద్దం మండలాల్లో పనిచేస్తున్న అంగన్వాడీలకు పెండింగ్ లో ఉన్న కాయగూరల బిల్లులు , టిఎ, గ్యాస్, చౌక ధాన్యపు నుండి బియ్యం,బ్యాళ్లు, ఇతర సరుకులు,రవాణా చార్జీలు చెల్లించాలని కోరారు.అదేవిధంగా హెల్పర్స్ కు ప్రాజెక్ట్ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన సిడిపిఒ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆటో నాగప్ప, ప్రాజెక్ట్ కోశాధికారి మాబున్నీసా, సెక్టార్ లీడర్లు సావిత్రమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సిడిపిఒకు వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

చేనేతపై జీఎస్టీని తొలగించాలని అధికారులను కోరుతున్న చేనేత కార్మికులు

చేనేతపై జీఎస్టీని తొలగించండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ముద్రా రుణాల మంజూరులో చేనేతలకు జిఎస్టిని తొలగించాలని చేనేత కార్మికులు కోరారు. ఈ సందర్భంగా మండలంలోని చేనేత కార్మికులు తమ సమస్యలను మంగళవారం జౌలి శాఖ అధికారులకు విన్నవించారు. ముద్ర రుణాలు మంజూరులో బ్యాంకులో 50వేల రూపాయలు మంజూరు చేస్తే రుణగ్రస్తుని అకౌంటులో 15 వేల రూపాయలు డిపాజిట్ చేయాలని చెబుతున్నారన్నారు. రుణాలు జిఎస్టి ఉన్న వ్యక్తి అకౌంట్లో బ్యాంకు వేస్తున్నారని చెప్పారు. దీంతో జిఎస్టి దారుడు సుమారు నాలుగు వేలనుంచి ఆరు వేల రూపాయలను పట్టుకొని లబ్ధిదారునికి ఇస్తున్నారని వాపోయారు. బ్యాంక్ అధికారులు జిఎస్టి ఉన్న వ్యక్తులకే రుణాలు మంజూరు చేస్తున్నారని చెప్పారు. 50వేల రూపాయలు రుణం తీసుకుంటే ప్రతినెల రెండు వేల రూపాయలతో 36 నెలలు చెల్లించాలని చెబుతున్నారని దీంతో దాదాపుగా బ్యాంకు వారికి 70 వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని అన్నారు. ఇదిలా ఉంటే బ్యాంకు వారు తమ సేవల నిమిత్తం ఈ 36 నెలలో 3 వేల రూపాయల వరకు అధికంగా వసూలు చేస్తారని అన్నారు. ముద్ర రుణాలు లక్ష రూపాయల వరకు ప్రభుత్వం ఇస్తుందని చెప్తున్నా బ్యాంకు వారు కేవలం 50 వేల రూపాయల కంటే ఎక్కువ ఇవ్వటం లేదని చెప్పారు. ఈ ముద్ర లోను తీసుకోవడం కంటే బయట ప్రైవేటు వ్యక్తులతో తీసుకునే ఋణం సులభతరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. 50వేల రూపాయల ముద్ర రుణాలకు పదివేల రూపాయల వరకు మార్జిన్ మనీ ఇవ్వాలని అయితే ఈ మార్జిన్ మని 2017 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఏ ఒక్క ముద్ర రుణగ్రస్తునికి బ్యాంకు వారు అందించలేదని వాపోయారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన అధికారులు బ్యాంక్ అధికారులు సంప్రదిస్తామని అదేవిధంగా ముద్ర రుణాల మంజూరులో జీఎస్టీ విషయంపై ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ జోలి శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు రాజారాం, సత్య సాయి జిల్లా జౌళి శాఖ అధికారి రామకృష్ణ, చేనేత కార్మికులు శీలా నారాయణస్వామి, మంచాల అశ్వర్థ, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలపై గ్రామసభ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని పందిపర్తి పంచాయతీ లో తహశీల్దార్ రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. రీసర్వే సమస్యలపై జరిగిన ఈగ్రామ సభలో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సర్వేయర్ ముద్దగంగప్ప, తెలుగుదేశం నాయకులు శ్రీనివాసరెడ్డి, రాజు, అశ్వర్థ నారాయణ, గోవిందప్ప, లక్ష్మీనారాయణ, మైలారప్ప, జనసేన నాయకులు రహంతుల్లా, ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో ఓపెన్‌హౌస్

పోలీసు ఆయుధాలపై విద్యార్థినులకు వివరిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వి.రత్న మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పాఠశాలల, కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు, ప్రముఖులు తరలివచ్చారు. ఒపెన్ హౌస్ లోని ఆయుధాల గురించి విద్యార్థులకు జిల్లా ఎస్పీ స్వయంగా అవగాహన కల్పించారు. క్లిష్ట సమయాల్లో ఏ ఆయుధాన్ని ఏ విధంగా వినియోగిస్తారు, వాటి పని తీరు గురించి తెలిపారు. పోలీసు వ్యవస్థ పనితీరు గురించి, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాల గురించి కళాశాల, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరులైన పోలీస్ త్యాగాలను మనమందరం గుర్తుంచు కోవాలన్నారు. ప్రదర్శన కార్యక్రమాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ కి షిఫాన్ డాగ్స్ గౌరవ వందనం చేసి పూల బొకేలు అందజేశాయి.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా డాగ్ స్క్వాడ్ ప్రదర్శించిన దృశ్యాలు విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయుల ను ఆకట్టుకున్నాయి. హత్యలు, ఆత్మహత్యలు వంటి సంఘటనలు జరిగినప్పుడు నిందితుల ఆనవాళ్లను ఏ విధంగా పసిగడతాయో వంటి దృశ్యాలను వాటి శిక్షకులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ముఖ్యంగా తారా, డైనడాగ్స్ ఐరన్ రింగ్ లో జంపింగ్ చేస్తూ వెళ్లిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

విఐపిల భద్రత పై నాటిక రూపంలో ప్రదర్శన.

వీఐపీలకు ఇచ్చే భద్రతలో పోలీసులు విధులలో భాగంగా అనుకోని సంఘటన జరిగినప్పుడు వీఐపీలను రక్షించే సమయంలో పోలీసులు ప్రాణ త్యాగం చేసి అమరులైన దృశ్యాలను ఏఆర్ ఆర్ఐ మహేష్ తన సిబ్బంది చేత చేయించిన నాటిక ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. సమాజంలో అల్లర్లు, గొడవలు చెలరేగినప్పుడు వాటిని సద్దుమణిగించే తరుణంలో పోలీసులు ఎటువంటి చర్యలు చేపడతారు, అందులో గుంపులను చెదరగొట్టడానికి వారిపై ప్రయోగించే టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జి చేయడం, అప్పటికి అల్లర్లు కంట్రోల్ కాకపోతే ఫైరింగ్ చేయడానికి ఎస్పీ ఆదేశాల మేరకు ఫైరింగ్ చేయడం వంటి విషయాలను ప్రదర్శన రూపంలో చక్కగా చూపారు. ఈ ప్రదర్శనలలో పాల్గొన్న సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఎలా మోసపోతారన్న విషయాలపై సైబర్ క్రైమ్ పి ఐ తిమ్మారెడ్డి స్క్రీన్ పై ప్రదర్శన రూపంలో విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు , పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, ఎఆర్ డీఎస్పీ జెడ్. విజయ్ కుమార్, ఎస్బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐలు వలి, మహేష్, రవికుమార్, సిఐలు తిమ్మారెడ్డి , సునీత సురేష్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, ప్రదీప్ సింగ్, వెంకటేశ్వర్లు, పుట్టపర్తి ప్రముఖులు, ఉపాధ్యాయులు పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ కార్యాలయంలో పెత్తనమంతా ముగ్గురిదే..!

తనకల్లు తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి - తనకల్లు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పెత్తనమంతా ఆ ముగ్గురు గ్రామ రెవెన్యూ అధికారులదే అన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఏ చిన్న పని కావాలన్నా, సకాలంలో తమకు ఎటువంటి ధ్రువపత్రం కావాలన్నా, కేవలం ఆ ముగ్గురి ద్వారానే జరుగుతున్నట్లు సమాచారం. తహశీల్దార్ కూడా ఆ ముగ్గురుకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మండలంలో సుమారు 7 మంది గ్రామ రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం గ్రామ రెవిన్యూ సహాయకులుగా పనిచేస్తూ రెవెన్యూ అధికారులుగా ఉద్యోగోన్నతి పొందిన వారే. వీరిలో చాలా మందికి రెవిన్యూ శాఖపై పట్టు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పొలం తగాదాలు, సమస్యల మీద వారికి మంచి అవగాహన కలిగి ఉంది. అయితే తహశీల్దార్ తమకు అన్ని విధాల సహకరించే గ్రామ రెవెన్యూ అధికారులకు మాత్రం పెద్దపీట వేస్తూ మిగతా వారిని చులకనగా చూడటం ఎంతవరకు సమంజసం అని ఆ కార్యాలయంలోని కొందరు వీఆర్వోలు ఆవేదన చెందుతున్నట్లు సమాచారం. మండల వ్యాప్తంగా స్మశాన వాటికల కోసం స్థల సమీకరణ చేయమని ఎమ్మెల్యే ఆదేశించిన కూడా మండల కేంద్రానికి సమీపాన ఉన్న స్థలాన్ని గుర్తించలేక పోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్న విమర్శలు వినపడు తున్నాయి. ఇప్పటికైనా తహశీల్దార్ తక్షణమే స్పందించి అన్ని గ్రామ పంచాయతీలలో శ్మశాన వాటిక లకు స్థలాన్ని కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాయల ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

చేనేత, జౌళి, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

త్వరలో శ్రీకష్ణదేవరాయులు,బాబయ్య స్వామి ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. సోమవారం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ పెనుకొండ పట్టణాభివృద్ధికి పార్టీలకతీతంగా కషి చేద్దామన్నారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కియా, అనుబంధం పరిశ్రమలు ప్రస్తుతం పెనుకొండలో ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలను తీసుకురానున్నామని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలో మౌలిక వసతుల కల్పించాల్సి ఉందన్నారు. పెనుకొండలో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల ఉద్యోగులు, ఇతరులు అనంతపురం, పుటపర్తి వంటి ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. పెనుకొండలో మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపునకు సిఎం సుముఖం వ్యక్తంచేశారని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వంపైనే కాకుండా సొంతంగానూ ఆదాయ మార్గాల పెంపుదలపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించాలని మంత్రి స్పష్టంచేశారు. ముఖ్యంగా పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చూపొద్దన్నారు. పన్నుల బకాయిల వసూళ్లలో రాజీపడొద్దని, రాజకీయ ఒత్తిళ్లను పట్టించుకోవొద్దని మున్సిపల్ అధికారులకు మంత్రి ఆదేశాలిచ్చారు. అధికార, ప్రతిపక్షాలు సైతం పట్టణ అభివృద్ధిలో రాజకీయాలకతీతంగా వ్యవహరించాలని సూచించారు.

దాతల సాయం తీసుకోండి

ప్రభుత్వమిచ్చే నిధులపైనే ఆధారపడకుండా, సీఎస్ఆర్ ఫండ్స్, విరాళాల సేకరణపై వినియోగంపై దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులకు మంత్రి సూచించారు. దాతల నుంచి విరాళాల సేకరణకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు కూడా ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో చైర్మన్ ఉమర్ ఫరూక్ , వైస్ చైర్మన్ సునీల్ కుమార్, కమిషనర్ శ్రీనివాసులు, మేనేజర్ నాగరాజు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ దినేష్, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి రఘునాథ్ రెడ్డి శేషాద్రి తయుబ్, సద్దాం, భాస్కర్ నాయక్, రామాంజనేయులు, శోభన్ సప్తగిరి, గీత హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

చేనేత పథకాలను సద్వినియోగం చేసుకోండి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి రామకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

చేనేత కార్మికులు నూతన చేనేత సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి రామకృష్ణ సూచించారు. మంగళవారం పట్టణంలోని తెలుగు చేనేత కార్మిక శిక్షణ కేంద్రంలో నూతన చేనేత కార్మిక పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఎన్నో పథకాల ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. తద్వారా కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. సహకార సంఘంలోని సభ్యులకు చేనేత ముడి సరుకులపై ఐదు శాతం జీఎస్టీ రాయితీ ఉంటుందన్నారు. అలాగే 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం లభిస్తోందని చెప్పారు. రుణాలు మంజూరైన కార్మికులకు 20 శాతం సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హిందూపురం ప్రాంతంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చేనేత కార్మికులకు జాకార్డులు, లిఫ్టింగ్ యంత్రాలు 90శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన చేనేత కార్మికులందరూ చేనేత క్లస్టర్ ద్వారా అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సోమందేపల్లి :చేనేత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత జోలి శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు రాజారాం, సత్య సాయి జిల్లా చేనేత జోలి శాఖ అధికారి రామకృష్ణ కోరారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ప్రభుత్వం చేనేత కార్మికులకు అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు సబ్సిడీలు తదితర విషయాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మరియు చేనేత జౌళి శాఖామంత్రి సవితమ్మ చేనేతలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేనేత కార్మికులు నూతనంగా చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని ఈ సంఘాల సభ్యులకు చేనేత ముడి సరుకుపై ఐదు శాతం జీఎస్టీ రాయితీ, 100 యూనిట్లు ఉచిత విద్యుత్, ఆర్ఎంఎస్ఎస్ పథకం ద్వారా 15 శాతం యార్న్ సబ్సిడీ, 20 శాతం సబ్సిడీతో ముద్రా రుణాలు అందిస్తారన్నారు. ప్రతి చేనేత కార్మికుడు చేనేత సహకార సంఘాల్లో సభ్యులుగా చేరాలన్నారు. చేనేత కార్మికులకు జాకారులు లిఫ్టింగ్ మిషన్లు తదితర పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 50 సంవత్సరాలు నిండిన సుమారు 12712 మంది చేనేత కార్మికులకు ప్రతినెల రూ.4వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం చేనేత పెన్షన్ అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మదన్మోహన్, చేనేత ఏడీవో పవన్ కుమార్, సీడీఈ శివ గోవర్ధన్, డిజైనర్ ప్రసన్న, మండల టిడిపి కన్వీనర్ సిద్ధలింగప్ప, టౌన్ కన్వీనర్ వడ్డే సురేష్, మాగే చెరువు సర్పంచి నరసింహులు, తెలుగుదేశం యువ నాయకులు గట్టా మహేంద్ర, గోపాల్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పౌరసరఫరాల శాఖ పరిధిలో మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న హమాలీలకు దసరా బోనస్ ఇవ్వాలని కూలి రేట్ల పెంచాలని సిఐటియు, హమాలీ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి అశ్వర్థ నాయక్ కు సిఐటియు ఆధ్వర్యంలో హమాలీ సంఘం నాయకులు మంగళవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. దసరాకి ఇవ్వవలసిన బోనస్ కూడా ఇంతవరకు ఇవ్వలేదని అన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకుతున్న సివిల్ సప్లై హమాలీలకు న్యాయబద్ధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని సిఐటియు అనుబంధ సంఘం నాయకులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు.

ఆర్‌జెడిని కలిసిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఆర్‌జెడి శ్యాముల్, డిఇఒ కిష్టప్పను యూటిఎఫ్ జిల్లా నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఈసందర్భంగా వారిని కోరారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు వలి, శివశంకర్, నరేష్ కుమార్, లక్ష్మీనారాయణ, రమేష్ బాబు, రామకృష్ణ, లక్ష్మయ్య, లతా దేవి తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

మృతుల కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం లోని ఒకటవ వార్డు గూడ్స్ షెడ్ కొట్టాల కి చెందిన మందల మల్లికార్జున ఆయన భార్య మందల మీనాక్షి 10 రోజుల వ్యవధిలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 50 వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబంలో ఏ కష్టం వచ్చినా అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం

చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలను మంగళవారం ఆపాఠశాల ప్రిన్సిపల్ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు గిరి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 13 ఉమ్మడి జిల్లాల నుండి 130మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి రోజు గ్రూపు కాంపిటేషన్ కింద చెస్ పోటీలను నిర్వహించారు. బుధవారం ఈ పోటీలు ముగుస్తాయని విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప, ఎసిఎఫ్ జిల్లా కార్యాదర్శి మొరార్జీయాదవ్, ఆర్గనైజర్ సురేష్, పరిశీలకులు ఉమేష్ కుమార్, ఉదయ్ కుమార్, శివ, ఆదిరత్నకుమార్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మహేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని మలకవేముల క్రాస్ సమీపంలో గల సర్వే నెంబర్ 354లో కొందరు అక్రమంగా రహదారి నిర్మించారంటూ స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆర్డీవో సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. 354 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని వీటిపై గ్రామ సభ జరిగే సమయానికి నివేదిక అందించాలని డిటి నారాయణస్వామిని ఆదేశించారు. పొలాలకు వెళ్లడానికి రహదారి నిర్మించుకున్నామని అది ప్రభుత్వ భూమిని తమకు తెలియదని ఒకవేళ ప్రభుత్వ భూమి అయితే ఆ స్థలాన్ని విడిచిపెడతామని సంబంధిత రైతు ఆర్డీవోకు తెలిపారు. అలాగే పొలాలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విషయమై సర్వే నిర్వహించి నివేదిక అందించాలని ఆర్డీవో సిబ్బందిని ఆదేశించారు. విలువైన ప్రభుత్వ భూముల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాలపై సమగ్ర సర్వే నిర్వహించి తమకు నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ సుమలత, డీటీ నారాయణస్వామి, ఇఒఆర్‌డి దివాకర్, ఆర్ఐ, కార్యదర్శి, విఆర్ఒ పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ఊటకూరు ఎర్రగుంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా వనరుల కేంద్రం, పుట్టపర్తి వ్యవసాయ సంచాలకులు సన్నావుల్లా వ్యవసాయ పట్టు పరిశ్రమ శాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పంటసాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడిఎ సనావుల్లా, మండల వ్యవసాయ అధికారిణి విజయ భారతి. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : రైతులు పంట సాగుపై అధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి తిమ్మప్ప కోరారు. మంగళవారం మండల పరిధిలోని కోతులగుట్ట ,గుర్రప్ప కొండ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ కంది, మొక్కజొన్న ,రాగి ,పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాండురంగప్ప, రైతు సేవ కేంద్రం తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - గుడిబండ

అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా వారం రోజులుగా పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన ఆటల పోటీలు, వ్యాసరచన పోటీల విజేతలకు గుడిబండ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం బహుమతులు ప్రదానంచేశారు. మడకశిర రూరల్ సిఐ రాజ్ కుమార్, ఎస్ఐ ముని ప్రతాప్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు ఆదిశేఖర్, మల్లికార్జున, వెంకటేష్, మహమ్మద్ రఫీ, పాతన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిఇఒ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇటీవల బాధ్యతలు చేపట్టిన డిఇఒ కిష్టప్ప కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

రక్తదాన శిబిరం

కదిరి టౌన్ : పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

ఎటిఎం ఏర్పాటు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలో ఎట్టకేలకు ఎటిఎంను ఏర్పాటు చేశారు. గత కొంతకాలం గా ఎస్‌బిఐకు సంబందించిన ఎటిఎం పని చేయడం లేదు, ఎటిఎం అందుబాటులో లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సిపిఎం అధ్వర్యంలో కొద్ది రోజుల క్రితం ఎస్‌బిఐ ముందర ఆందోళన చేశారు. దీంతో స్పందించిన ఎస్‌బిఐ మేనేజర్ గండి కోటా అనిల్ కుమార్ వెంటనే ఉన్నత అధికారులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఎటిఎంను సిపియం నాయకులతో కలసి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చలు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కలెక్టర్ చేతన్‌తో మంగళవారం సమావేశం అయ్యారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఆయన కలెక్టర్‌తో చర్చించారు.

జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాల బాలికల షూటింగ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 11 స్కూళ్ల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా 12 మంది అబ్బాయిలు, 12 మంది అమ్మాయిలు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ మనోహర్ రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల అనంతపురం జిల్లాలోని నార్పల లో జరిగే 43 వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జగదీష్, సత్య సాయి జిల్లా సెక్రెటరీ పూల ప్రసాద్, పీడీలు ఉషారాణి, నాగరాజు, లక్ష్మీనారాయణ, పీఈటీలు స్వర్ణ కుమారి , చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా లెవెల్ ఆర్ట్ ఫెస్టివల్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసులో ఏరియా లెవెల్ ఫెస్టివల్ ఆర్ట్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భగా పలు రకాల నైపుణ్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో ప్రమీల, ఏటీఎల్ కృష్ణ, కావేరి, ప్రకాష్, రమణ, పర్వీన్, శ్రీరాములు, కేజీబీవీ సిబ్బంది శిల్ప, రెడ్డమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కన్వీనర్‌గా రామకృష్ణ

ప్రజాశక్తి - నల్లచెరువు

సిపిఎం మండల కార్యదర్శిగా రామకృష్ణను ఎన్నుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు రామాంజనేయులు, వెంకటస్వామి, భీమ్లానాయక్, శ్రీరాములు, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పెనుకొండ

అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సిఐ హరికృష్ణ తెలిపారు. సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయన పల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై కర్నాటక నుంచి స్కోడా కారులో అక్రమంగా తరలిస్తున్న 864 టెట్రాపాకెట్స్ మద్యాన్ని గుర్తించామన్నారు. ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకొని కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ సింహ, కానిస్టేబుల్ భరత్, మల్లికార్జున , కృష్ణయ్య, బీమ్లానాయక్ , లక్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రొద్దం మండలం కంచిసముద్రంలో నరసింహులు అనే వ్యక్తి వద్ద 92 హైవాట్స్ విస్కీ కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. ఈ దాడులలో ఎస్ఐ రాజశేఖర్, రాముడు, హెడ్ కానిస్టేబుల్ రమేష్,జనార్ధన్, హరి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి - రొద్దం

రొద్దంలోని మసీదు వద్ద నూర్ మొహమ్మద్ తన ఇంటి వద్ద ఉంచి ద్విచక్రవాహనాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు.. దీంతో మంగళవారం ఉదయం రొద్దం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఆటో, కారు ఢీకొన్న ఈ ప్రమాదంలో విష్ణు (21) మృతిచెందాడు. ఐదుగురికి గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సిఐ శ్యాంరావు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టపాసుల విక్రయదారులు జాగ్రత్తలు తీసుకోవాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-పెనుకొండ

టపాసుల విక్రయదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిఎస్‌పి వెంకటేశ్వర్లు అమ్మకం దారులను హెచ్చరించారు మంగళవారం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లోని టపాసుల విక్రయ కేంద్రాలు పరిశీలించి అమ్మకం దారులకు తగిన సూచనలు ఇచ్చారు, దుకాణంలో ఫైర్ సేఫ్టీ పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, సిఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

గాండ్లపెంట : బాణాసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలని తహశీల్దార్ బాబూరావ్ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాణాసంచా విక్రయ స్థలంలో ప్రతిదుకాణానికి పది అడుగుల దూరం ఉండేలా చూడాలన్నారు. దుకాణదారులు ఇసుక నీళ్లు దగ్గర ఉంచుకోవాలన్నారు. బాణసంచా ధరలు పట్టికను ఏర్పాటు చేయాలని అన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

మండల పరిధిలోని శిరగం వాండ్ల పల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త వెంకట రామప్ప సోమవారం గుండె పోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవితమ్మ మంగళవారం శిరగం వాండ్ల పల్లికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోముశేఖర్, మాజీ సర్పంచి సుధాకర్ రెడ్డి, నరేంద్ర రాయల్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ద్రోహి జగన్ : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళా ద్రోహి జగన్ అని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ఆస్తుల కోసం విజయమ్మ ను కోర్టుకు ఈడ్చడం సిగ్గుచేటు అన్నారు. షర్మిల భావోద్వేగానికి గురికావడంలో తప్పు లేదన్నారు. తల్లి చెల్లి తో పాటు ఎంతో మంది మహిళలను మోసం చేసిన వ్యక్తి జగన్ అని ఆరోపించారు.

గుడిబండ : తెలుగుదేశం పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప కోరారు. గుడిబండ మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ఆయా పంచాయతీకి సంబంధించిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులతో సహా నాయకులు పాల్గొనాలని కోరారు. అదేవిధంగా మండలంలోని జమ్మలబండ గ్రామంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలోతెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జమ్మలబండ పంచాయతీ మాజీ సర్పంచి శ్రీనాథ్,బూదిపల్లి జయ రామప్ప, మాజీ ఎంపిటిసి వెంకటేష్, భోజరాజు,వైస్ సర్పంచి నాగేంద్ర, డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కదిరి మున్సిపాల్టీకి రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి - కదిరి టౌన్

2023-24 సంవత్సరానికి ఏపీ మెప్మా ఆధ్వర్యములో ప్రధాన మంత్రి స్వానిధి పథకం క్రింద రుణాలు మంజూరు, వసూళ్లలో కదిరి మున్సిపాలిటికి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ఈ మేరకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన శాఖమాత్యులు పి నారాయణ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కదిరి మున్సిపాలిటీ మెప్మాలో సకాలంలో రుణాలు మంజూరు వసూళ్లలో రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని ఈ అవార్డు తమపై మరింత బాధ్యత పెంచిందని అన్నారు.

ఆరోగ్యానికి ప్రాచీన వైద్య విధానం కీలకం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రాచీన వైద్య విధానం ఆరోగ్యానికి కీలకం అని, ఆయుర్వేదం వ్యాధుల చికిత్సకు అత్యంత పురాతనమైన పద్ధతుల్లో ఒకటిగా పరిగణించబడుతుందని ఆయూష్ వైద్యురాలు అనురాధ అన్నారు. ధన్వంతరి జయంతిని పురష్కరించుకుని నిర్వహించుకుంటున్న ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా రూరల్ మండలం సంతేబిదనూరు అయూష్ వైద్యాదికారి అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బాలికల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరంతో పాటు ఆయుర్వేద వైద్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయం తనిఖీ

కొత్తచెరువు: స్థానిక డిఇఒ కార్యాలయాన్ని ఆర్‌జెడి శ్యాముల్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అపార జనరేషన్ ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని డిఇఒ కిష్టప్పకు సూచించారు. అనంతరం సీసీఈ మార్కుల నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యల అధికారి లాజర్, ఎంఇఒ జయచంద్ర, హెచ్ఎంలు రమీజా బేగం, వాణిభాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆర్డీవో

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ రాష్ట్ర చేనేత జౌలీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పుట్టపర్తి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన సువర్ణ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుట్టపర్తి రెవెన్యూ డివిజన్లో నెలకొన్న సమస్యలను ఇరువురు చర్చించుకున్నారు.

ప్రమాదకర ప్రయాణం

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని వివిధ ప్రయివేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. వాహనాల డ్రైవర్లు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఓ ప్రయివేటు పాఠశాల వద్ద ఆటో డ్రైవర్లు ఆటోలో కూర్చొని విద్యార్థులను టాప్ పైకి ఎక్కించి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఏదైనా ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి వాటిపై సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.